# ఎండాకాలపు వాన



## కె.వి.మధుసూదనరావు

**ఆ గ్రామంలో చీకటి రాజ్యమేలుతోంది...**

ఆకాశంలో ఉన్న చుక్కలు ఒక్కొక్కటి మాయం అవుతున్నాయి. 'తమదే రాజ్యం' అన్నట్లుగా మేఘాలు ఆకాశాన్ని కప్పేస్తున్నాయి. మేఘాల కదలికతో అంతెత్తునుండి పడుతున్న వర్షపు బిందువులు నేలపై పడి ఆ నిశ్శబ్ద వాతావరణంలో శబ్దం చేస్తున్నాయి.

నెమ్మదిగా విజృంభించి వానా, గాలి పెరిగాయి. వీధుల్లో జనసంచారం లేదు. పెరుగుతున్న వాన, గాలికి భయపడి తలుపులు మూసుకుని నిద్రాదేవి కోసం ఎదురుచూస్తున్నారందరూ. గ్రామం నడిబొడ్డున లంకంత కొంపలో కుర్చీలో కూర్చున్న రావుగారు అసహనంగా కదిలారు. ఆ హేమంత వర్షపు గాలులకు ఆయన శరీరం వణుకుతోంది. శరీరానికి చుట్టబడియున్న శాలువా చలిగాలికి రెపరెపలాడుతోంది.

రిటైరైన నాలుగేళ్ళనుండీ ఆ లంకంత ఇంటిలో ఆయన ఒక్కరే ఉంటున్నారు. భార్య పార్వతమ్మ మూడేళ్ళ క్రిందటే పోయింది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఆ పల్లెటూళ్ళో ఉండలేక దూరంగా ఎక్కడో పట్టణంలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. అందువల్ల ఒంటరి జీవితానికి అలవాటుపడ్డారు రావుగారు.

చలిగాలి పెరిగి వర్షం కురుస్తున్నా ముసలి ప్రాణం కావడంవల్ల నిద్రపట్టడంలేదాయనకు.

జేబులోనుండి పుగాకు తీసి చుట్టగా చుట్టారాయన. నాలుగు అగ్గిపుల్లలు మారాం చేయగా ఐదో అగ్గిపుల్ల బుద్ధిగా వెలిగింది. గుప్పగుప్పన పొగ వదులుతూ మరింతగా ముడుచుకు కూర్చున్నారాయన. వేడివేడి పొగ గుండెల్లోకి వెళుతున్నా వయసు ప్రభావం వల్ల అంతగా వేడిని ఇవ్వడంలేదు.

గేటు దగ్గర ఏదో అలికిడి అయింది.

కళ్ళజోడును పంచెకు తుడిచి పరిశీలనగా అటువైపు చూసారాయన.

ఏదో ఆకారం గేటు దగ్గర వణుకుతూ నిలబడి ఉంది. మరింతగా కళ్ళు చిట్లించుకుని అటువైపుగా చూసారాయన.

ఆ... వీధిలో ఉండే పిచ్చిది.

వర్షానికి తడుస్తూ రావుగారివైపు చూస్తూ తన భాషలో ఏదో అడుగుతోంది.

''పాపం తడిసిపోతోందే, అవును పిచ్చిదానికి ఎవరు ఆశ్రయం ఇస్తారు'' అనుకొంటూ—''ఇలారా'' అన్నట్లు పిలిచారాయన.

నెమ్మదిగా అరుగుపైకి వచ్చిందామె.

రిటైరైన తరువాత తను ఈ గ్రామం వచ్చినప్పటి నుండి గ్రామంలోనే ఉంటోందది. వీధుల్లో ఉంటూ ఎవరైనా ఏదైనా పెడితే తింటూ చెట్ల క్రింద ఏవో పిచ్చి పనులు చేస్తూ ఉంటుంది.

అసలు ఆమెది ప్రక్క గ్రామమట. ఆరు సంవత్సరాల క్రితం పొలం తగాదాలలో ఆమె భర్తను చంపివేయడం వల్ల ఆమెకు పిచ్చిపట్టిందట. అలనా, పాలనా చూసేవాళ్ళు లేక మరింత ఎక్కువై పాపం.. రోడ్లు పట్టుకు తిరుగుతోంది.

ఆమె గురించి అంతే తెలుసు రావుగారికి.

నిలబడి ఉన్న ఆమె స్టూలుపై ఉన్న అరటి పళ్ళవైపు ఆశగా, ఆపై ఆకలితో చూస్తోందామె. అర్థం చేసుకొన్నారాయన.

పాపం తిండి ఎప్పుడు తిందో. అరటిపళ్ళలో ఓ ఆరింటిని తీసి ఆమెకు అందించారాయన. పిచ్చిదని ముద్రవేయబడినప్పటికి మామూలు మనిషి కంటే బాగానే తింటోంది.

చిరిగిపోయిన చీర చలిగాలికి ఆమె శరీరాన్ని సరిగా కప్పలేకపోతోంది. వానకి తడిసి ఉండడం వల్ల శరీరానికి అతుక్కుపోయి... సిగ్గు తెలియని ఆమె అవయవాలను స్పష్టంగా చూపుతోంది ఆ చీర.

ఆమె సరిగా ఉన్న రోజుల్లో కట్టుబొట్టులో ఎంత శ్రద్ధ తీసుకొందో.

ఆమె వైపు పరిశీలనగా చూసారు రావుగారు.

నాలుగు గజాల చీర ఆమె ఒంటిపై నామమాత్రంగానే ఉంది. పేరుకు పిచ్చిదే అయినా 'వయస్సుది' కావడం వల్ల శరీరం మట్టిపట్టినా పొందికగానే ఉంది. లూజుపాటి రవిక ఆమె శరీరాన్ని మరింత బయట పెడుతోంది.

అవేమీ ఆమెకు తెలియడం లేదు. ఉరుముల వర్షానికి వణుకుతూ అరటిపండ్లు తింటోంది.

ఎక్కడో ఉరుము ఉరిమి పెద్ద శబ్దంతో పిడుగు పడింది. ఆ శబ్దానికి కొద్దిగా కంపించిందామె.

నిలబడి ఆమెవైపు అలాగే చూస్తున్నారాయన. చలిగాలులకు ఆయన మరింతగా వణుకుతున్నారు.

చుట్ట ఆఖరి దశకు వచ్చింది. గట్టిగా ఓ దమ్ము లాగి దాన్ని వీధిలోకి విసిరేసారు.

విపరీతమైన చలిలో ఆయనలో ఒంటరితనం మేల్కొంటోంది.

సిగ్గు తెలియని ఆమె అవయవాలు చూస్తుంటే ఆయన వయస్సు పదిహేనేళ్ళు వెనక్కి పోతోంది.

ముసలి రక్తం నెమ్మదిగా 'వేడి' పుంజుకొంటోంది. నరాలలో కొత్త శక్తి ఏదో వచ్చినట్లనిపిస్తోంది.

నెమ్మదిగా అడుగులువేస్తూ ఆమెను సమీపించారాయన. వెనుకనుండి గట్టిగా పట్టుకున్నారు. వాన మరింతగా విజృంభించింది.

''పాపం పిచ్చిది మోసం, కపటం తెలియనిది అనేవి ఏదీ ఆయనకు తెలియడం లేదు. స్వతహాగా

మగాడిలో ఉండే 'ఖజం' అతడిలో ప్రవేశించింది. ఎన్నాళ్ళగానో వంటరితనం... ఆపై ముసలితనం ఆయనలో ఏదో భావం... లోకం దృష్టిలో అది తప్పు అనే మాట ఆయనకు వినిపించడం లేదు. అతడు కేవలం ఇప్పుడు 'మగవాడు' అంతే!''

ఏమీ తెలియక గింజుకోసాగిందామె.

అయినా ఆయనలో పట్టు సడలలేదు.

పెనుగులాడుతోంది ఏమీ తెలియక ఆమె. అయినా ఆ 'సమయం' గాబట్టి రావుగారి చేతులు ఆమెను బలంగా చుట్టేస్తున్నాయి.

గట్టిగా పట్టుకున్నారాయన. జారి నేలపై పడిపోయిందామె.

గుడ్డిదీపం ఒక్కసారిగా ఆరిపోయింది. గదంతా చీకటి... అప్పుడప్పుడు మెరుస్తున్న మెరుపులు మాత్రమే ఆ ఇంటిలో ప్రవేశిస్తున్నాయి. ఆ మెరుపుల వెలుగులో ఆ గదిలో రెండు శరీరాలు నేలపై పొర్లాడుతున్నాయి.

పెనుగులాటలో హఠాత్తుగా...

ప్రక్కనే ఉన్న స్టూలు ఆమె నెత్తిపై పడింది. మరి మాట్లాడలేదామె. అలానే ఉండిపోయింది.

రావుగారు విజృంభించారు.

హఠాత్తుగా వాన తగ్గింది.

నెమ్మదిగా పంచె సవరించుకొంటూ లేచారాయన. శరీరం చెమటతో నిండిపోయింది. జేబులో ఉన్న అగ్గిపెట్టె తీసి వెలిగించారు.

గదిలో వెలుగు నిండుకొంది.

నేలపై అస్తవ్యస్తమైన బట్టలతో అలానే పడుకొని ఉన్న ఆమెవైపు అనుమానంగా చూసారాయన.

ఆయన గుండె గట్టిగా కొట్టుకొంటోంది. నెమ్మదిగా ఆమెను కదిపారు. లేవలేదామె. నెత్తి దగ్గర రక్తం గడ్డ కడుతోంది. అంతే! ఒక్కసారిగా పైకి లేచారాయన.

ఆయన శరీరం మరలా వణకడం మొదలైంది. నరాలు కూడా లాగేస్తున్నాయి.

ఏదో ఆలోచించారాయన. ఆమె శరీరాన్ని భుజంపై వేసుకున్నారు...

** ** **

ఉదయం వీధిలో చెత్తకుప్ప దగ్గర జనం పోగయ్యారు. చెత్తకుప్ప ప్రక్కనే పిచ్చిదాని శవం.


''పాపం రాత్రి కురిసిన 'వర్షానికి' తట్టుకోలేక చచ్చిపోయింది'' విచారిస్తున్నారందరూ! కిటికీలో నుండి బయటకు చూసారు రావుగారు.

పిచ్చిదాని కళ్ళు తెరిచే ఉన్నాయి. కళ్ళల్లో నుండి ఓ కాంతిరేఖ రావుగారితో ఏదో మాట్లాడుతోంది.

బయట నుండి చూసేవారికి కిటికీ ఊచలలో నుండి దోషిలా కనబడుతున్నారాయన. గజ్జిపట్టిన ఓ కుక్క దూరాన్నుండి రావుగారివైపు చూస్తూ ''నీ సంగతి నాకు తెలుసులే'' అన్నట్లుగా మొరుగుతోంది.

ఆకాశంలో మరలా మబ్బులు పడుతున్నాయి.

# భారతీయం



కానీ,
నీ చేయి పట్టుకు తిరుగుతూ
నీ వెన్నుతట్టి పలుకుతూ
తనుచేసే మారణహోమంలో
నిన్నే సమిధని చేస్తున్నా
నీ సాటివాడి
ప్రకృతి అది
ఏ ప్రకృతి విపరీతం ఇది?

డా. ముక్తేవి భారతి

## కరచాలనం కబుర్లు

—బి.ఆర్.సుంకర

పండగలూ పబ్బాలకీ, పిన్నలు పెద్దవాళ్ళ కాళ్ళకి నమస్కారం చేయడం మన ఆచారం. కానీ పాశ్చాత్య సాంప్రదాయం జీర్ణించుకుపోయిన తర్వాత ఈనాడు షేక్‌హాండ్ (కరచాలనం) చాలా సర్వసాధారణమైన ఆచారమైంది. కాస్త పరిచయమున్న వ్యక్తిగానీ, స్నేహితుడుగానీ కనిపిస్తే చాలు—ఆనందంతో మనం షేక్‌హాండ్ ఇస్తాం. ఈ కరచాలనం కబుర్లు కొన్ని చాలా తమాషాగా ఉంటాయి.

ఒక పెద్ద మనిషి ఇంగ్లాండులోని 'నాటిగవ్'కి షరీఫ్‌గా ఎన్నికయ్యాడు. ఆ తరవాత మొదటి మీటింగ్‌లోనే ఆయన ఒకేరోజు సుమారు 500 మందికి షేక్‌హాండ్ ఇవ్వాల్సొచ్చింది. ఆయన చేతి నరాలు ఆ వత్తిడికి తట్టుకోలేక, విపరీతమైన బాధకు గురయ్యాయి. కానీ, ఇది ఒకనాటి ముచ్చట కాదు. ప్రతిరోజూ ఆయన ఇలా కరచాలనం చేయక తప్పదు. ఈ బాధ నుంచి ఎలా తప్పుకోవాలో తెలియక, ఆయన దీర్ఘంగా ఆలోచించాడు. తన చేతిని షేక్‌హాండ్ ఇచ్చేవాళ్ళ చేతి వత్తిడి నుండి రక్షించుకోవడానికి దళసరి ప్లాస్టిక్ తొడుగొకటి చేయించుకుని గ్లోవుస్ (చేతి తొడుగులు) కింద ధరించేవాడు. దీని వలన కొంత ఉపశమనం లభించినా కరచాలనం బాధ తప్పలేదు. ఆ తరువాత ఈ బాధ తట్టుకోలేక షరీఫ్ పదవికే ఆయన రాజీనామా చేసేశాడు.

ఒకసారి లార్డ్‌మాంట్ గోమరీ ఆస్ట్రేలియా యాత్రకు వెళ్ళాడు. ఆ యాత్ర పూర్తయి తిరుగుముఖం పట్టేసరికి అతని చెయ్యి ఉబ్బిపోయి, విపరీతమైన బాధకు గురైంది. అసంఖ్యాకమైన అభిమానులకి షేక్‌హాండ్ ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందాయనకి. ఒకసారి శ్రీలంక ఉన్నతాధికారి భార్య ఒక సభలో 500కు పైబడిన అభిమానులకి షేక్‌హాండ్ ఇవ్వాల్సొచ్చింది. ఆ కారణంగా ఆమె చేతి ఎముక స్థానభ్రంశం చెందింది.

కరచాలనం బాధ స్వర్గస్థులైన డ్యూక్ ఆఫ్ విండ్సర్ (ఆనాటి ప్రిన్స్ ఆఫ్ వేల్స్)కి కూడా తప్పలేదు. ఒకసారి కరచాలనం చేస్తుండగానే ఆయన చేతి ఎముక వుండాల్సిన చోటు నుంచి తప్పుకుంది. కొన్నాళ్ళ వైద్యం అనంతరం అది యథాస్థానానికి చేరుకుంది.

కరచాలనం తలనొప్పి సుప్రసిద్ధులకు మాత్రమే కాదు, సామాన్యులకి కూడా తప్పదు. న్యూజెర్సీలో ఇద్దరు స్నేహితులు చాలాకాలం తరువాత కలుసుకున్నారు. ఆ ఆనందంలో ఒళ్ళు మరిచి, గట్టిగా కరచాలనం చేసుకున్నారు. దాంతో ఒకడి చేతి చిటికిన వేలు పుటుక్కుమంది. దాంతో ఇన్నేళ్ళ స్నేహాన్ని గంగలో కలిపేసి, అతడు మిత్రుడు మీద కారాలు మిరియాలు నూరుతూ కోర్టుకెళ్ళాడు. నష్టపరిహారంగా 700 పౌండ్లు అంటే 15,400 రూపాయలు వసూలు చేసిగానీ నిద్రపోలేదు.

కరచాలనంలో ప్రపంచ వ్యాప్తమైన రికార్డ్ స్థాపించినవారు అమెరికా మాజీ రాష్ట్రపతి థియోడోర్ రూజ్‌వెల్ట్. ఈయన ఒకేరోజు 8,513 మందికి షేక్‌హాండ్ ఇచ్చారట!